
సాక్షి బాపట్ల

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



కొనసాగుతున్న సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. పలు విభాగాలకు చెందిన దివ్యాంగులు పరీక్షలు చేయించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 517.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి నిత్యన్నదానానికి కావూరుకు చెందిన తుమ్మల సాయి రాఘవ్ రూ. లక్ష విరాళాన్ని గురువారం సమర్పించారు.

న్యూస్‌రీల్

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

అభ్యంతరాల స్వీకరణ 11 వరకు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు వెబ్‌సైట్లో ఉంచి సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈనెల 11వ తేదీలోపు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన తరువాత వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

సొపాడులో వీధి కుక్కల దాడి

ఏడుగురికి తీవ్ర గాయాలు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం సొపాడు గ్రామంలో వీధికుక్కలు దాడిచేసి ఏడుగురిని గురువారం తీవ్రంగా గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన వారిని 108లో గుంటూరుకు జీజీహెచ్‌కు తరలించారు. ఇటీవల గ్రామాల్లో శునకాల బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత శనివారం వట్టిచెరుకూరు గ్రామంలో రైతు మక్కెన సుబ్బారావుకు చెందిన బర్రెదూడపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇప్పటికీ దూడ పరిస్థితి విషమంగానే ఉంది. తాజాగా గురువారం జరిగిన దాడిలో గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయవ్యవస్థకు ప్రజలకు మధ్య పారా వలంటీర్లు వారధులు

13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ



నరసరావుపేటటౌన్: న్యాయవ్యవస్థకు, ప్రజలకు మధ్య వారధిలా ఉండి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ పేర్కొన్నారు. గురువారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్ల విధులు, నైతికత, రాతపూర్వక నైపుణ్యం, రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను, చట్టపరమైన సలహాలు ఇచ్చే విధివిధానాలను గురించి వివరించారు. న్యాయవ్యవస్థకు ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించి ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన కల్పించేలా కృషి చేయాలని సూచించారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 10వేల మెట్రిక్ టన్నులు

నరసరావుపేట: రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ 10వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా నిర్దేశించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం సేకరణ సమావేశం వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. రబీలో 2024-25 సంవత్సరానికి 234 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 20,561 హెక్టార్లలో వరిసాగు చేశారన్నారు. దీనిలో 1,32,773 ఎంటీల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయటం జరిగిందన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటా రూ.2320లు, సాధారణ రకం క్వింటా రూ.2300లుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందాలంటే ఈ-పంట ద్వారా పంటను నమోదుచేయించి 100శాతం ఈకేవైసీ చేయించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను త్వరగా కాలిబ్రేషన్ చేయించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నారదమునిని ఆదేశించారు. తనిఖీ చేసి మిల్లు సామర్థ్యం, ఇతర వివరాలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలన్నారు. కనీస మద్దతు ధరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామని, కొనుగోలుకేంద్రాల ద్వారా తాము పండించిన పంటను విక్రయించాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: వేసవి కాలంలో తాగునీటి ఇబ్బంది రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండ తీవ్రత, వడగాల్పులు ఉంటాయని తెలిపారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విరామం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితిలో తాగునీరు, ఓఆర్ఎస్, పండ్ల రసాలు వంటివి తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఒంటరి వృద్ధ మహిళల ఆరోగ్యంపై ఆశా వర్కర్లు రోజు పర్యవేక్షించేలా చూడాలన్నారు. డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని రకాల తాగునీటి పరీక్షలు చేయడానికి సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రతి గురువారం రాత్రి డ్రమ్ములలోని నీటిని తీసివేయాలని, శుక్రవారం ఉదయం వాటిని ఎండబెట్టి సాయంత్రం నింపుకోవాలని ప్రజలను కోరారు. కుక్కల బెడద నివారించాలని అధికారులతో పేర్కొన్నారు. 70 ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద కార్డు జారీ కోసం ఈకేవైసీ చేయించాలని తెలిపారు.

పారిశుద్ధ్యంపై ఆరా

పారిశుద్ధ్యంపై కలెక్టర్ ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా వివరాలు సేకరించగా 42 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. రోజు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త, ప్రమాదకర వస్తువులను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. వాటిని ఎస్‌డబ్ల్యూపీపీ ప్రదేశంలో పడేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులలోని నీటి నిల్వలపై ఆరా తీశారు. తక్కువ లోతు గల బోర్ల నీటిని వాడవద్దని ప్రజలకు సూచించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించే సర్వేలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆరేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదును 10వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. జిల్లా జేసీ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంత రాజు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, బాపట్ల డీఎల్‌డీవో విజయలక్ష్మి, వీక్షణ సమావేశం ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్ట్

పరారీలో మరో నిందితుడు


చీరాల: స్థలం విషయంలో తలెత్తిన వివాదం హత్యాయత్నానికి దారి తీసింది. ఈ సంఘటన చీరాల రూరల్ మండలం గవినివారిపాలెంలో గత నెల 28న జరిగింది. ఈ కేసులో ఐదుగురు నిందితులను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు డీఎస్పీ ఎండీ మోయిన్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చీరాల మండలం గవినివారిపాలెంలో చీదరబోయిన లక్ష్మీనారాయణ ఇంటి ముందు స్థలంలో రాములమ్మ భూమి ఉంది. అక్కడ పాత ఇల్లు కూల్చి కొత్తగా నిర్మిస్తున్నారు. స్థలం హద్దుల విషయంలో గొడవలు జరిగాయి. చీదరబోయిన లక్ష్మీనారాయణ మేనల్లుడు అయిన రైల్వే పోలీస్ కానిస్టేబుల్ పిన్నిబోయిన లక్ష్మీనారాయణ ఈ గొడవలలో జోక్యం చేసుకున్నాడు. గత నెల 28న రాములమ్మతో చీదరబోయిన లక్ష్మీనారాయణ కుమారుడు భరత్‌కుమార్ గొడవ పెట్టుకున్నాడు. రాములమ్మకు ఆమె మనుమడు సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చీదరబోయిన నాగేశ్వరరావు మద్దతుగా వచ్చాడు. నాగేశ్వరరావును హత్య చేస్తే తమకు అడ్డు ఉండదని ప్రత్యర్థులు నిర్ణయించుకుని ఇంటి ముందు కూర్చొని ఉన్న అతడిపై కత్తితో దాడి చేశారు. స్థానికులు రావడంతో నిందితులు పరారయ్యారు. నిందితులను కావూరివారిపాలెం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. చీదరబోయిన లక్ష్మీనారాయణ, చీదరబోయిన వీరయ్య, చీదరబోయిన భరత్‌కుమార్, గొర్ల వేణు, వెంపరాల కుమారస్వామిలు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. పిన్నిబోయిన లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నాడు. డీఎస్పీతోపాటు రూరల్ సీఐ శేషగిరిరావు, రూరల్ ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మోయిన్

మొరాయిస్తున్న సాగర్ కుడికాలువ గేట్లు

విజయపురిసౌత్: సుమారుగా 10.50లక్షల ఎకరాలకు సాగునీరందించే కుడి కాలువ గేట్లు మూడేళ్లకే మరమ్మతులకు లోనయ్యాయి. 8వ గేటు కిందికి దిగకపోవడంతో గురువారం ఎమర్జెన్సీ గేటు ద్వారా దానిని మూసివేసి 2వ గేటు ద్వారా కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు గేట్లు ఉండగా, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు 9 గేట్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం కుడి కాల్వ 9వ గేటు కిందికి, పైకి జరుగకపోవడంతో బలవంతగా కిందికి దింపేందుకు ప్రయత్నం చేయగా ఊడిపోయి కాలువలోకి కొట్టుకు పోయింది. ఆ గేటును అమర్చకపోవటంతో చాలా రోజులు వరకు నీటి విడుదల కొనసాగింది. ఆ సమయంలోనే కుడి, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దగల తూములకు కొత్తగేట్లకు టెండర్లు పిలిచారు. 9వ గేటు మరమ్మతులు చేశాక అదే కంపెనీకి పనులు అప్పగించారు. కుడి హెడ్ రెగ్యులేటర్ గేట్లకు తొమ్మిదింటికిగాను రూ.3.30కోట్లు, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ మూడు గేట్లకు రూ.2.50కోట్లు, సూట్ గేటుకు రూ.1.50కోట్లకు 2022లో టెండర్లు పిలిచి పనులు చేయించారు. అవి కాస్త అప్పుడే మరమ్మతులకు గురైనట్లు సమాచారం. విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో హెడ్‌రెగ్యులేటర్ గేట్లు అంతగా వినియోగించ లేదు. నీటి అవసరాల మేరకు ఎక్కువగా 2,9వ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఇటీవలే ఈ రెండు గేట్లు మూసివేసి 8వగేటు ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం దానిని మూసేందుకు ప్రయత్నించగా కిందికి దిగలేదు. దీంతో ఇంజినీర్లంత శ్రమించి ఎట్టకేలకు మూసివేశారు. ప్రస్తుతం 2వ గేటు ద్వారా 3,031 క్యూసెక్కులు కుడి కాలువకు విడుదల చేస్తున్నారు. బుధవారం వరకు 4050 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



కుడికాలువ హెడ్ రెగ్యులేటర్

బస్సును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

- బస్సు కింద ఇరుక్కుపోయిన వృద్ధ జంట
- కాపాడిన వాహన చోదకులు

బాపట్ల టౌన్: ఆగి ఉన్న బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన మండలంలోని అసోదివారిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. అసోదివారిపాలెం సమీపంలో హైవేపై స్కూల్ బస్సు నిలిచి ఉంది. అదే సమయంలో చీరాల నుంచి బైకుపై కర్లపాలెం వెళ్తున్న వృద్ధ దంపతులు అదుపుతప్పి బస్సును ఢీకొట్టారు. బస్సు కింది భాగంలోకి టీవీఎస్ ఎక్సెల్ దూసుకెళ్లి ఇరుక్కుపోయారు. వాహనచోదకులు తక్షణమే స్పందించి వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వారు కర్లపాలెం మండలం తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది.



బస్సు కింది భాగంలో దంపతులు

ఎస్సీ కాలనీలో దాడికి యత్నం

మార్టూరు: మండలంలోని వలపర్ల ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం జరిగిన ఘర్షణకు సంబంధించిన వీడియోలు బాధితులు జిల్లా ఎస్పీకి పంపడంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. కాలనీకి చెందిన కొన్ని కుటుంబాలు ఒంగోలు సమీపంలో పొగాకు పనుల నిమిత్తం ఇటీవల వెళ్లాయి. అక్కడ జరిగిన వివాదం నేపథ్యంలో రెండు రోజుల క్రితం వలపర్లకు తిరిగి వచ్చాయి. అనంతరం గురువారం సాయంత్రం ఘర్షణ ప్రారంభమైంది. ఓ వర్గానికి చెందిన కొందరు యువకులు కర్రలతో ఓ కుటుంబంపై దాడికి వస్తున్న దృశ్యాలను వీడియోలు తీసి జిల్లా ఎస్పీ తుషార్ డూడీకి పంపారు. దీనిపై ఫిర్యాదు కూడా చేశారు. ఎస్పీ ఆదేశాలతో సీఐ శేషగిరిరావు సిబ్బందిని వలపర్లకు పంపించి ఇరు వర్గాలకు చెందిన కొందరిని స్టేషనుకు పిలిపించారు.



దాడికి యత్నిస్తున్న యువకుడు

మూగ వేదన

కూటమి పాలనలో పశువులకు అందని సంచార వైద్య సేవలు

- మొదటి విడత వాహనాలు నిలిపివేత
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న పోషకులు
- వైద్యం చేయించాలంటే వ్యయప్రయాసలు

బాపట్ల టౌన్: రాష్ట్రంలో 108, 104 తరహాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్కారు వినూత్నంగా ఆలోచించి గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు వైద్యసేవలు అందేలా ప్రణాళిక అమలు చేసింది. 2022 మే 18వ తేదీన సంచార పశు వైద్య వాహనాలకు శ్రీకారం చుట్టింది. ఉన్నత లక్ష్యంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ చర్యలు చేపట్టారు. నియోజకవర్గానికి ఒక వాహనాన్ని కేటాయించారు. నిరంతరాయంగా పశువులకు సేవలు అందించారు. కూటమి అధికారంలోకి వచ్చాక వీటికి గ్రహణం పట్టింది. నెల రోజులుగా వాహనాలు మూలకు చేరాయి. కాంట్రాక్టు గడువు ముగియడంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు వాటిని నిలిపివేశారు.

ఆందోళనలో పశుపోషకులు

జిల్లాలో లక్షల సంఖ్యలో కోళ్లు, గేదెలు, ఆవులు, ఎద్దులు, ఇతర పెంపుడు జంతువులు ఉన్నాయి. సమస్య వస్తే జంతువును వాహనంలోకి హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఎక్కించి అక్కడే అన్ని పరీక్షలు చేసేవారు. 20 రకాల మల సంబంధిత, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రోస్కోప్‌తోపాటు ఆటోగ్లేవ్ ప్రయోగశాలను కూడా వాహనంలో ఉంచారు. అత్యున్నత టెక్నాలజీతో వాహనాన్ని తీర్చిదిద్దారు. దీనికి 108, 104 తరహాలోనే 1962 నంబరును కేటాయించారు. జిల్లాలో రెండు విడతలలో 6 చొప్పున వాహనాలు మంజూరు చేశారు. ప్రస్తుతం నెల రోజులుగా 6 వాహనాలతోనే వైద్యం అందిస్తున్నారు. పశువులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు.



నిలిచిపోయిన సంచార పశువైద్య వాహనం

జిల్లాలోని పశువుల సమాచారం

నియోజకవర్గం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	పందులు	కోళ్లు
అద్దంకి	3,658	87,341	1,78,129	19,299	1,251	63,666
బాపట్ల	4,195	68,554	50,931	10,952	126	1,54,663
చీరాల	1,640	26,844	33,467	2,723	151	44,125
పర్చూరు	3,676	50,287	1,05,939	8,557	528	64,226
రేపల్లె	6,226	90,187	44,175	3,997	468	2,69,760
వేమూరు	2,535	58,551	14,882	4,462	695	1,79,582
మొత్తం	21,930	3,81,764	4,27,523	49,990	3,219	7,76,022

వాహనాలను పునరుద్ధరించాలి



గత ప్రభుత్వ హయాంలో సంచార పశు వైద్య వాహనాలు ఉండేవి. వాటి ద్వారా పశువులకు ఇంటి వద్దే వైద్యం అందేది. ప్రస్తుతం ఆ వాహనాలు నిలిచిపోవడంతో మాకు చాలా ఇబ్బందిగా ఉంది. ఇటీవల అనారోగ్యంతో రెండు గొర్రెలు చనిపోయాయి. పశువులకు అనారోగ్యం వస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూగజీవాల ఆరోగ్యం దెబ్బతింటే ప్రైవేటు వాహనాల ద్వారా సమీపంలోని పశు వైద్యశాలకు తరలించాల్సి వస్తోంది. దీంతో వ్యయప్రయాసలు తప్పడం లేదు. ప్రభుత్వం తక్షణమే సంచార పశువైద్య వాహనాలను పునరుద్ధరించాలి.

– వల్లు చిన్నగంగయ్య, ముత్తాయపాలెం

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



జిల్లాలో పశుసంవర్ధక శాఖలో మొదటి విడతలో వచ్చిన ఆరు సంచార పశు వైద్య వాహనాల గడువు ముగియడంతో పక్కన పెట్టారు. ప్రస్తుతం రెండో విడతలో వచ్చిన వాహనాలతో పశు పోషకులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. మొదటి విడతలో వచ్చిన వాహనాలు మరో 15 రోజుల్లో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాం.

– డాక్టర్ వేణుగోపాల్, జిల్లా పశువైద్యాధికారి

కన్నకొడుకే కాలయముడు

బొల్లాపల్లి: కన్న కొడుకు చేతిలో జన్మనిచ్చిన తల్లి దారుణంగా హత్యకు గురైన సంఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో గురువారం జరిగింది. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... వెల్లటూరు గ్రామానికి చెందిన గజ్జ చిన్న నరసయ్య, గజ్జ సోమమ్మ (67) దంపతులకు ముగ్గురు మగ, ఇద్దరు ఆడ సంతానం. చిన్న కుమారుడు బాదరయ్య అవివాహితుడు కావడంతో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. మిగిలిన సంతానంలో అందరికీ వివాహాలై వేర్వేరుగా ఉంటున్నారు. మతిస్థిమితం లేని తల్లి ఎప్పుడు గొణుగుతుండడం, తనకు వివాహం కాకపోవడంపై అసంతృప్తిగా ఉన్న నిందితుడు బాదరయ్య తెల్లవారుజామున మంచం మీద పడుకుని నిద్రిస్తున్న తల్లిని రోకలిబండతో కొట్టడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు గజ్జ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అందజేశారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రభాకర్

అన్నదాతకు అకాల కష్టం

- కోతకొచ్చిన రబీ వరి పంట
- కళ్లాల్లోనే మిర్చి, కంది
- వాటిని కాపాడుకునేందుకు రైతుల తంటాలు
- వర్షం దెబ్బకి వరిని నష్టానికి అమ్ముకున్న కొందరు రైతులు

కారెంపూడి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో కర్షకులు నానా అవస్థలు పడ్డారు. నోటి దగ్గరకొచ్చిన పంటను కాపాడుకోడానికి రైతులు పడరాని పాట్లు పడ్డారు. కారెంపూడి మండలంలో కళ్లాల్లో ఉన్న మిర్చి, ధాన్యం, కందులు తడిసి పోకుండా వాటిని కుప్పలుగా చేసి పట్టలు కప్పడంలో రైతులు తలమునకలయ్యారు. పట్టలు తీసుకుని పొలాలకు ఉరుకులు పరుగులు పెట్టి పొలాలలో కళ్లాలలో ఉన్న పంట ఉత్పత్తులు తడిసిపోకుండా పట్టలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. మబ్బులు పట్టగానే కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని, మిర్చిని చాలా మంది వచ్చిన ధరకు తెగనమ్మేశారు. ఇప్పటికే కళ్లాల్లో ఆరిన పంటలను గోతాలకు పట్టి ఇళ్లు చేర్చుకున్నారు.

కోతకు రబీ వరి.. కళ్లాల్లో మిర్చి, కంది

ఉరుములు మెరుపులతో కూడిన జల్లులతో రైతుల గుండెలు దడదడలాడాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఎక్కడ తడిసిపోతాయోనని వాటిని కాపాడుకోడానికి అష్టకష్టాలు పడ్డారు. మరో వైపు కంది కళ్లాలు జరుగుతున్నాయి. కళ్లాలను త్వరగా పూర్తి చేసేందుకు రైతు కూలీలు కష్టపడ్డారు. వర్షం రాకతో కళ్లం చేసిన గింజలతో కూడిన పొట్టును మిషన్‌లో పోసే అవకాశం కూడా లేకుండా పోయింది. మిరప కాయల కోతలు కూడా జరుగుతున్నాయి. దీంతో కోసిన కాయలు తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు. మరో వైపు రబీ వరి చేలన్నీ కోతకు వచ్చాయి. ఈ దశలో వర్షం పడితే గింజ పాడైపోతుందని గింజలు నేలపాలు అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఎరువుల కొట్లలో బాకీలున్న చిన్న సన్నకారు రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని జిలకర సన్నాలు 75 కిలోల బస్తా రూ.1540కే తెగనమ్మారు. కొనేనాథుడు లేడని, వర్షం వల్ల బతిమాలి పంటను అమ్మాల్సిన దుస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాచర్లలో భారీ వర్షం

మాచర్ల: అత్యధిక ఎండతో ఇబ్బంది పడుతున్న మాచర్ల వాసులకు మారిన వాతావరణం కాస్తంత ఉపశమనం కలిగించింది. గురువారం మధ్యాహ్నం వాతావరణంలో ఆకస్మికంగా మార్పు వచ్చి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు సేద తీరారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు పారింది.



ఒప్పిచర్లలో కల్లంలో ఉన్న ధాన్యాన్ని గోతాలకు పడుతున్న కూలీలు

క్లుప్తంగా

ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేయండి



బాపట్ల: ఎన్‌సీడీ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టరు ఎస్.విజయమ్మ వైద్యులకు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో వైద్యాధికారులతో ఈ సర్వేపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో వివరాలు పొందుపరచాలని సూచించారు. ప్రతి ఒక్కరికి సంబంధించిన ఆరోగ్య విషయాలపై ఆరా తీసి వివరాలు నమోదు చేయాలన్నారు.

వైద్యం కోసం రూ.లక్ష ఆర్థిక సాయం



బాపట్ల: ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కోమట్ల ధనలక్ష్మి కుటుంబానికి కుమ్మరి కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్టు రూ.లక్ష సాయం అందించింది. గురువారం స్థానిక మర్రిపూడిలో ధనలక్ష్మి కుటుంబ సభ్యులకు ఈ మొత్తం అందించారు. ట్రస్టు అధ్యక్షులు ఓటికుండల విజయభాస్కర్‌రెడ్డి , ఓటికుండల శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి ఓటికుండల లక్ష్మణరావు, కోశాధికారి కుమ్మరి అంజిరెడ్డి, సభ్యులు వేజండ్ల శ్రీనివాసరావు, రామయ్య, తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు రాతమశెట్టి సత్యనారాయణ రూ.5వేలు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



వేమూరు: మండలంలోని చంపాడు ఇరిగేషన్ కాలువ వంతెన వద్ద ఇసుక ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. వివరాలు మేరకు... కొల్లూరు మండలంలోని గాజులంక నుంచి తెనాలికి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పోలీసు స్టేషన్‌లో ముడుపులు చెల్లించడంతో రాత్రి వేళ తిరిగే లారీలు, ట్రాక్టర్ల యజమానులపై పోలీసులు కేసు నమోదు లేదు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గాజులంక గ్రామం నుంచి ఇసుక లోడుతో ట్రాక్టర్, లారీ బయలుదేరాయి. చుంపాడు ఇరిగేషన్ కాలువ వంతెన వద్ద ట్రాక్టర్‌ను లారీ ఢీకొని పడిపోయింది. వంతెన వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అక్రమ ఇసుక విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ నాయకులు ఘటనాస్థలం వద్దకు చేరుకున్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు వచ్చి మిషన్ల ద్వారా ఇసుక లారీని తొలగించారు. సీఐ మాట్లాడుతూ స్టేషన్‌లో ఫిర్యాదు అందలేదన్నారు. కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

సాగు వ్యర్థాల నిర్వహణపై అవగాహన



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బాపట్ల: నేల సజీవంగా ఉంటేనే మొక్కలు ఫలవంతమైన ప్రయోజనాన్ని రైతులకు చేకూరుస్తాయని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు పి.ప్రసూనరాణి పేర్కొన్నారు. దీనికి పర్యావరణ సమతుల్యతను కాపాడుకుంటూ వ్యవసాయ వ్యర్థాలను పునర్వినియోగించాలని సూచించారు. వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఐసీఏఆర్, ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా వ్యవసాయ వ్యర్థాల నిర్వహణపై వ్యవసాయ కళాశాల సేద్య శాస్త్ర విభాగంలో రైతులకు అవగాహన, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ వ్యర్థాల ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. సూక్ష్మ జీవులు, వానపాములను కాపాడుకోవడం ద్వారా మట్టి జీవన ప్రమాణాన్ని పెంచవచ్చన్నారు. సాగు రంగంలో విప్లవాత్మక మార్పులను చేపట్టేందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే ఈ కార్యక్రమాల్లో రైతులు పాల్గొని లబ్ధి పొందాలని కోరారు. కళాశాలలోని వర్మీకంపోస్టు, అజోల్లా, పుట్టగొడుగుల పెంపకం యూనిట్లను రైతులు సందర్శించారు. సేద్య విభాగాధిపతి డా.కె.చంద్రశేఖర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొండుభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన 25 మంది రైతులు, అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సుశీల, డాక్టర్ బి.సురేష్ కుమార్, డాక్టర్ డి.వి.ఎస్.అక్షయ్, డాక్టర్ నాయుడు, డాక్టర్ బి.మౌనిక, డాక్టర్ బి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భార్య, అత్తపై యువకుడి దాడి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



చికిత్స పొందుతున్న సంధ్యారాణి

చీరాల: భార్య, అత్తలపై ఓ యువకుడు కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం రాత్రి పేరాల మసీదు సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.......రేపల్లె నియోజకవర్గం అడవులదీవికి చెందిన తోకల కరుణాకర్‌కు పేరాలకు చెందిన కట్టా సంధ్యారాణితో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. మనస్పర్థలు రావడంతో కొంత కాలం నుంచి సంధ్యారాణి పేరాల మసీదు సెంటర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుంది. కరుణాకర్ తరచుగా భార్య ఇంటికి వచ్చి గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇంట్లో ఆమె తల్లి లక్ష్మి, కుమారుడు ఉన్న సమయంలో కరుణాకర్ వచ్చి గొడవపడ్డాడు. ఇంట్లో ఉన్న కత్తితో సంధ్యారాణిని పొడిచాడు. అత్త అడ్డుకోబోగా దాడి చేసి పారిపోయాడు. ఇద్దరు కేకలు వేసుకుంటూ రక్తపు గాయాలతో బయటకు రావడంతో చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు వారి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. టూటౌన్ సీఐ నాగభూషణం వివరాలు సేకరించారు.

ఏడుగురు జూదరులు అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: అక్కాయిపాలెం పంచాయతీ శివారులో జీడి తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. వారి నుంచి రూ.17,080 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

ఐదుగురు మహిళలకు గాయాలు

అద్దంకి రూరల్: పనులకు వెళుతున్న కూలీల ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ సంఘటన గురువారం అద్దంకి సమీపంలోని కలవకూరు గ్రామానికి వెళ్లే దారిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన మహిళలు పనులకు వెళ్లేందుకు అద్దంకికి ఆటోలో వస్తున్నారు. కలవకూరు దాటి ఇటుక బట్టీల వద్దకు వచ్చేసరికి ఎదురుగా పొట్టు లారీ వచ్చి ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నాగిపోగు మరియమ్మ, జంధ్రాజుపల్లి కోటేశ్వరమ్మ, బిరుదు చిట్టెమ్మ, మురికిపూడి శ్రీదేవి, ఎం.మరియమ్మకు గాయాలయ్యాయి. అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వారిని తరలించారు. తీవ్రగాయాలపాలైన నాగిపోగు మరియమ్మ, జంధ్రాజుపల్లి కోటేశ్వరమ్మలను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు పంపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

బొల్లాపల్లి: పురుగుమందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం కండ్రిక గ్రామానికి చెందిన బైలడుగు రమణ(45) మద్యానికి బానిసైన భర్తను బెదిరించేందుకు గత నెల 29వ తేదీన పురుగుల మందు తాగింది. వెంటనే బంధువులు వినుకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త చిన్న బాదరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ జె.భాస్కరరావు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

నూజెండ్ల: వ్యక్తి హత్యాయత్నానికి పథకం రచించిన సెల్‌ఫోను వాయిస్ రికార్డు బయటపడటంతో ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.వి.కృష్ణారావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అల్లీభాయిపాలెం గ్రామానికి చెందిన కర్నాటి వెంకటరావు అదే గ్రామానికి చెందిన మీరావలీ మధ్య నగదు లావాదేవీలు ఉన్నాయి. వెంకటరావు దగ్గర మీరావలీ అప్పుగా కొంత నగదు తీసుకున్నాడు. ఈ విషయంలో ఇరువురు మధ్య అభిప్రాయబేధాలు వచ్చాయి. అప్పు తీర్చకపోగా కర్నాటి వెంకటరావును హత్య చేసేందుకు ప్రణాళిక రచన చేశాడు. ఈక్రమంలో పాటకోట లాలయ్య, గద్వాల మీరావలీ, బ్రహ్మం, దూదేకుల దస్తగిరితో కలిసి చంపాలని నిర్ణయించుకొని దానికి తగిన నగదు ఇవ్వటానికి మీరావలి ఒప్పందం చేసుకున్నాడు. ఈ పథకం విషయమై జరిగిన సంభాషణలు వారిలో ఒకరు రికార్డు చేశారు. వాయిస్ రికార్డు లీక్ అవటంతో కర్నాటి వెంకటరావు అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా వాస్తవమని పోలీసులు నిర్ధారణ చేసి నిందితుడు మీరావలితో పాటు నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎంవీ కృష్ణారావు తెలిపారు.

ఇళ్ల స్థలాల పరిశీలన



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలు వద్ద శుక్రవారం పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను శుక్రవారం ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్థల పట్టాల పంపిణీని ప్రారంభించనున్న నేపథ్యంలో ఎస్పీలీ పరిశీలన జరిపారు. అధికారులకు భద్రతా సూచనలు చేశారు. ట్రాఫిక్, , వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ వై. శ్రీనివాసరావు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

చోరులున్నారు.. తస్మాత్ జాగ్రత్త: ఎస్పీ

బాపట్ల టౌన్: వేసవికాలంలో విహార యాత్రలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సెలవుల్లో ఇంటికి తాళాలు వేసి విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో, ఇతర సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుచుకొని వెళ్లాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చాలామంది ప్రజలు ఆరుబయట నిద్రించడం, ఇంటి తలుపులు తెరచి ఆదమరచిపోవడం జరుగుతోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విలువైన వస్తువులు, నగదున్న బీరువాకు తాళాలు వేసుకోవాలని పేర్కొన్నారు.

సముద్రంలోకి తాబేలు పిల్లలు విడుదల



తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న ఎమ్మెల్యే తదితరులు

వేటపాలెం: మండలం పరిధిలోని రామాపురం సముద్రతీరంలో అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్ సంయుక్త ఆధ్వర్యంలో సముద్ర తాబేళ్ల రక్షణ కేంద్రం నుంచి 404 పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చేతుల మీదుగా గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ రకపు తాబేళ్లను సంరక్షించడం గొప్ప విషయం అని ఆయన అన్నారు. జిల్లా అటవీ శాఖాధికారి ఎల్.భీమయ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6 సముద్ర తాబేళ్ల రక్షణ కేంద్రాలు ఉన్నాయని గుర్తుచేశారు.

దాదాపు 145 తాబేళ్లు 15 వేల గుడ్లు పెట్టగా, కృత్రిమంగా పొదిగించి సముద్రంలోకి పిల్లలను వదులుతున్నట్లు చెప్పారు. చీరాల నియోజకవర్గం పరిధిలో రామచంద్రాపురం, పొట్టి సుబ్బయ్య పాలెం, రామాపురం గ్రామాలలో ఈ కేంద్రాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, ఐటీసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సూరజ్ ప్రదాన, మాజీ సర్పంచ్ జంగిలి రాములు, రామాపురం గ్రామస్తులు సున్నపు సుబ్బారావు, రజని పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే దాడులు

- మోటారు సైకిళ్లపై మాజీ సీఎం జగన్ బొమ్మ పెట్టుకున్నా తట్టుకోలేక పోతున్నారు
- ఉద్దేశపూర్వకంగా దాడులు
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్



మాట్లాడుతున్న ఎం.ఎన్.ప్రసాద్

వినుకొండ: దేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మాత్రమే ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రమే అమలవుతోందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ ఆళ్ల సాంబిరెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఎం.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ కూటమి నేతలు నేరపూరిత, ఘర్షణ వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నారు కాబట్టే తాము రెడ్‌బుక్ రాజ్యాంగం అంటున్నామన్నారు. ఇటీవల బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామంలో ఆళ్ల సాంబిరెడ్డి, ఆళ్ల పాపిరెడ్డిలపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారని, వారి ఇళ్లపై కూడా దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనను స్థానిక టీడీపీ నేతలు కూడా ఖండించారని గుర్తు చేశారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం ఏ రాజ్యాంగంలో ఉందని, గ్రామాల్లో భావప్రకటన స్వేచ్ఛ కూడా లేకుండా మోటారు సైకిళ్లపై మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రం కనిపిస్తే ఆ బళ్లు ధ్వంసం చేయడం, అకారణంగా దాడులు చేయడం కూటమి నేతలకు పరిపాటిగా మారిందన్నారు. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను గుర్తించి కేసులు నమోదు చేయడం, వేధించడంతో పాటు ఇరువర్గాల ఘర్షణలో కూడా ఒక వర్గం వారికి స్టేషన్ బెయిల్, మరో వర్గం వారిపై 307కేసులు నమోదు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేయాలని అన్నారు.

గ్రామాల్లో కక్షలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం...

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అమ్మిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కక్షాపూరిత వాతావరణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, చిన్నచిన్న ఘర్షణల్లో కూడా పోలీసులు తలదూర్చి కేసులు నమోదు చేయడం తాము ఎక్కడా చూడలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యలు పట్టించుకోకుండా గ్రామాల్లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం ఏంటని ప్రశ్నించారు. బాధితుడు సాంబిరెడ్డి మాట్లాడుతూ అకారణంగా తమ కుటుంబంపై దాడి చేసి తన జేబులో సెల్‌ఫోన్ లాక్కొన్నారన్నారు. అదేమని ప్రశ్నించినందుకు తమ కుటుంబంపై మూకుమ్మడిగా దాడికి తన కన్నతల్లిపై కూడా దాడి చేశారన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన గెలుపు కోసం పనిచేశానని, తనపై జరిగిన దాడిని టీడీపీ నాయకులు వక్రీకరించడం బాధాకరమని అన్నారు. పార్టీ బొల్లాపల్లి మండల అధ్యక్షుడు బత్తి గురవయ్య, వినుకొండ అధ్యక్షులు దండు చెన్నయ్య, మన్నెయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్



జూలకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్

పిడుగురాళ్ల: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సూచించారు. పిడుగురాళ్ల పట్టణ, గ్రామీణ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో గురవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ... విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కరెంట్ బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ పరిధిలోని జానపాడు, రూరల్ పరిధిలోని జూలకల్లు సబ్ స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. వేసవిలో లోడ్ పెరుగుతున్న కారణంగా దానికి అనుగుణంగా విద్యుత్ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండి అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు. 50 శాతం అదనపు లోడ్ సబ్సిడీ స్కీమ్‌ను గృహ వినియోగదారులందరు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.నాగసురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.సింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాబ్ కార్డులను తొలగించడం అన్యాయం



ఉపాధిహామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

అమరావతి: యాక్టివ్‌గా లేవనే సాకుతో జాబ్ కార్డులను తొలగించడం అన్యాయమని జాబ్ కార్డుతో సంబంధం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికీ పని చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు అన్నారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు తెలుసుకోవటం కోసం నిర్వహించిన ఉపాధి హామీ బైక్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలలోఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను బైక్‌యాత్రలో వ్యవసాయ కార్మికసంఘ ప్రతినిధులకు వివరించారు. రవిబాబు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పనులుచేసిన కూలీలు కూడా ప్రస్తుతం జాబ్ కార్డులు యాక్టివ్‌గా లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. జాబ్‌కార్డులు లేక, పనులకు వెళ్లలేక అనేక మంది కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆధార్‌కార్డుకు బ్యాంకు ఎకౌంటుకి ఫోన్ నెంబర్లకు లింకులు లేకపోవటం కూడా పెద్ద సమస్యగా మారిందన్నారు. నిరక్ష్యరాశ్యులైన కూలీలకు ఫోన్‌నంబరు లింక్‌చేయటంపై అవగాహన లేక చేసిన పనికి వేతనాలు అందక కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించి, కూలీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం నాయకులు జమ్మలమూడి భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై టీడీపీ శ్రేణుల దాడి



గాయపడిన శ్రీనివాసరెడ్డి

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు దాడికి దిగిన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొంత కాలంగా నరసరావుపేటలో నివాసముంటున్నాడు. మాజీ సర్పంచ్ వర్ధంతి కార్యక్రమానికి గ్రామానికి వచ్చాడు. పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి(పెదకాపు), అతని కుమారుడు బ్రహ్మారెడ్డి, కిష్టిపాటి లింగారెడ్డిలు విచక్షణారహితంగా దాడి చేశారు. ముఖంపైన తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేస్తుండగా స్పృహ కోల్పోవటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయపడిన శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఆసుపత్రిలో పరామర్శించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం తగదు

- డీపీఓ విజయభాస్కర్‌రెడ్డి
- ఇద్దరు కార్యదర్శులకు మెమోలు



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ విజయభాస్కర్‌రెడ్డి

నాదెండ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఘనవ్యర్థాల నిర్వహణపై కార్యదర్శులు అలసత్వం వహించకుండా పనిచేయాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. పలు గ్రామాల్లో గురువారం ఆయన పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

బుక్కాపురంలో రోడ్ల వెంబడి చెత్త కుప్పలు ఉండటం, పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామస్తులు పలు ఫిర్యాదులు ఆయన దృష్టికి తేవటంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. ఎండుగుంపాలెం గ్రామంలో ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శికి మెమో జారీ చేశారు. జంగాలపల్లెలో స్వామిత్వ సర్వే చివరి దశలో ఉండటంతో కార్యదర్శికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల కార్యదర్శులతో ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి అన్ని గ్రామాల్లో 22 అడుగుల వెడల్పుతో రోడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

టీడీపీ నేత నిమ్మతోటలో గంజాయి మొక్కలు

- రాజుపాలెం మండలం మొక్కపాడులోని తోటలో పెంపకం
- గంజాయి పచ్చి ఆకు కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- టీడీపీ నేత దొడ్ల సాంబయ్యపై చర్యలకు తాత్సారం

నరసరావుపేట: గంజాయి ఆకు అమ్ముతున్నారని ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన రాజుపాలెం మండలంలోని మొక్కపాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది.

గ్రామానికి చెందిన రేఖనారు నీల్ కుమార్, మొగిలి శివయ్య, దేవర ఏడుకొండలు పచ్చి గంజాయి ఆకును బ్యాగ్‌లో తరలిస్తుండగా పోలీసులు కాపుకాసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సుమారు నాలుగు కేజీల పచ్చి గంజాయి ఆకు ఉన్నట్లు గుర్తించి, ముగ్గురిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని విచారించగా గ్రామానికి ఉత్తరం వైపున గల దొడ్ల సాంబయ్య నిమ్మతోటలో గంజాయి మొక్కలు ఉన్నట్లు వారు తెలిపారు.

గురువారం పోలీసులు నిమ్మతోటను పరిశీలించగా గంజాయి మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. నిమ్మతోట యజమాని దొడ్ల సాంబయ్య తెలుగు దేశం పార్టీ నాయకుడు కావడంతో అతణ్ణి పోలీసులు స్టేషన్‌కు తీసుకురాకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారు. పచ్చి ఆకు కావడంతో నిపుణులు వచ్చి పరీక్షించిన తరువాత గంజాయి ఆకుఅని తేలితే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఘటనపై ఇంతవరకు కేసు నమోదు కాలేదు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

AP EAPCET 2025 BiPC విద్యార్థులకు షార్ట్‌టర్మ్ కోచింగ్ మరియు స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ బేసిక్స్ అత్యుత్తమ విద్యాబోధన. బ్లూలీ ఫెజియోథెరపి కాలేజ్, గుంటూరు. 8977779908, 6300004967

REAL ESTATE

బాపట్ల జిల్లా, అమృతలూరు గ్రామంలో మంచి లొకాలిటీలో 215 గజాల ఇంటి స్థలం & రోడ్డుకు సమీపంలో 5 ఎకరాల పొలం అమ్మకానికి కలదు. సంప్ర: 7893841849

PLOT FOR SALE

శ్రీ కృష్ణ బృందావనం! ఫార్మ్ హౌస్ లాండ్ గుంటూర్ (కొండవీడు) 25 కి.మీ పర్యటక ప్రాంతం సమీపంలో@ సెంటు లక్ష రూపాయలు, (10,14) సెంట్లు ప్లాట్స్ కలవు 8381449583

WANTED

ప్రముఖ కూల్‌డ్రింక్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు యువతి, యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000/- +3వేలు వెంటనే సంప్రదించండి. 9121469383

Wanted Teachers 6th-10th, lady teachers 1st to 5th, Viswa janani high school, Sangadigunta Guntur. Cont: 8555893767

హిందీభాషా పరిజ్ఞానము కంటెంట్స్ చక్కగా వ్రాయగలవారు సాధారణ విద్యార్హతలు కలిగి ఉన్న 30సం॥ లోపు యువకులు గ్రాఫిక్ డిజైనర్స్ గ్రాడ్యుయేట్/అండర్ గ్రాడ్యుయేట్ 30సం॥ లోపు ఎడోబ్ ఇల్లస్ట్రేటర్, కొరల్‌డ్రా, పేజ్‌మేకర్, ఫొటోషాప్ నందు కనీసం 2 సం॥ అనుభవం, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్స్, ఫ్రెష్ గ్రాడ్యుయేట్ 30సం॥లోపు డిజిటల్ మార్కెటింగ్ కనీసం 2సం॥ అనుభవం కలిగిన గ్రాడ్యుయేట్స్/అండర్ గ్రాడ్యుయేట్ యువకులు కావలెను. 9133642223, hr.manager@tulasigroup.com

డ్రైవర్స్ కావలెను. కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22282

ఉచితంగా కంప్యూటర్ MS Office, Spoken English, Computer హార్డ్‌వేర్ కోర్సులలో 3 నెలల శిక్షణ ఇచ్చి 100% ఉపాధి చూపించబడును. ఉచిత భోజనం, హాస్టల్. Qul: 10th, Inter, Degree, ITI and above, గుంటూరు. 9133444986 / 88 / 89

Wanted Trained Graduate with B.Ed or D.Ed to Teach CBSE Curriculum Class: Nursery to 10th EM Telugu-1, Hindi-1, English-1, Mathematics-1, GS-1, SS-1, PET-1, Drawing-1, Nursery-2nd Class - Mother Teachers to Teach All Subjects-5 Nos and Pro's-3, Salary 7k to 20k. Cont: Sparks EM School, Damarapalli, Guntur, Contact: 9912528244, 8142676274

గుంటూరు కాలేజీలోని చిన్న క్యాంటీన్ నందు సుమారు 50మందికి టీ, టిఫిన్ 8AM-6PM వరకు చేయుటకు అనుభవం గల సీనియర్ చెఫ్ కావలెను. 8977365999, 8712100333

ప్రముఖ స్టార్ హోటల్ గీతారీజెన్సీ నందు పనిచేయుటకు రెస్టారెంట్ వెయిటర్స్ & బాయ్స్ (వెజ్ మరియు నాన్ వెజ్), రూమ్ సర్వీస్ వెయిటర్స్, చైనీస్ మాస్టర్స్, పూరి & రైస్ మాస్టర్స్ ఆల్ రౌండర్స్, మెయింటెనెన్స్ బాయ్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, వాష్ పాంట్రీ మరియు కిచెన్ అసిస్టెంట్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525

ఉచితంగా Solar Technician, MS-Office, Spoken English కోర్సులలో 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించబడును. ఉచిత భోజన & హాస్టల్ వసతి. Q:10th, Inter, B.Tech and above (Pass/Fail) Age: 18-27సం॥ Add : గుంటూరు 9177133358, 9133444989

Wanted Girls Aged 18-24 years to work as Sales Girls in a Jewellery Showroom Fruitmarket, Lalapet, Guntur. Cont: 9700311201

ఫ్లిప్ కార్ట్ డెలివరీ బాయ్స్ కావలెను. మంగళగిరి, తాడేపల్లి, ఉండవల్లిలో జీతం 26,000/-, అర్జంటుగా కావలెను. ఫుడ్ ఫ్రీ. సంప్ర॥ 63043 51724, 89194 17824

కావలెను. కేర్ టేకర్స్ నర్సులు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే వుండి చూసుకొనుటకు అత్యధిక జీతం+ వ+భో. ఆంధ్ర హోమ్‌కేర్స్ VJA 91608 35559, 93473 80332

మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459.

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.